# సాక్షి
## నిజామాబాద్

ఆదివారం । 13 । ఆగస్టు । 2023






**జోరు తగ్గిన దరఖాస్తులు**

వైన్ దుకాణాలకు లైసెన్స్‌లకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. వరుస సెలవులు అడ్డంకిగా మారాయి.

- 8లో ▸



**రెండో ఏఎన్‌ఎంల పోరుబాట**

జిల్లావ్యాప్తంగా రెండో ఏఎన్‌ఎంలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రాల్లో నిరసనలకు దిగారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.0 /25.9

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది. అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డిపై కేసు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్ : ఎన్నికల్లో గుంపగుత్తగా తనకు ఓట్లు వేస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేస్తే స్వయం సహాయక సంఘానికి రూ.5 లక్షలు ఇస్తామని, టీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే సంఘానికి భవన నిర్మాణం చేయిస్తామంటూ ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి ఓటర్లను ప్రలోభ పెట్టారని సదాశివపేట పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టేసింది. తనపై ఆరోపణలకు ఆధారాలు లేకుండా తహసీల్దార్ చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, దీనిని కొట్టేయాలని కోరుతూ రవీందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె లక్ష్మణ్ ఇటీవల తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మర్కల్ విలేజ్‌లోని స్వయం సహాయక సంఘాల సభ్యుల సమావేశాన్ని రవీందర్‌రెడ్డి నిర్వహించి సంఘ సభ్యులు మొత్తం ఓట్లు వేస్తామని ఏకగ్రీవ తీర్మానం చేస్తే ఒకో గ్రూప్‌నకు రూ.5 లక్షలు ఇస్తామని, అధికారంలోకి రాగానే ప్రభుత్వం బిల్డింగ్ కట్టిస్తుందని ప్రలోభపెట్టారంటూ ఎమ్మార్వో ఫిర్యాదు చేశారు. దీనిపై సదాశివ నగర్ పోలీసులు పెట్టిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని ఆయన న్యాయవాది వాదించారు. ఎన్నికల షెడ్యూల్ 2018 అక్టోబర్ 6న వెలుడిన విషయం పత్రికల్లో పబ్లిష్ అయ్యిందని, ఫైనల్ ఓటర్ల లిస్ట్ అక్టోబర్ 12న రెడీ చేశారని, అక్టోబర్ 3వ తేదీ నాటికి ఎన్నికల షెడ్యూల్ అమల్లో లేదన్నారు. ఎఫ్ఐఆర్‌లో ప్రాథమిక ఆధారాల్లేవని హైకోర్టు తేల్చింది.

### నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్ అర్బన్ : కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి ఇటీవల జిల్లా విద్యాశాఖ అర్హత పరీక్షను నిర్వహించింది. ఇందులో ఎంపికైన వారికి నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ దుర్గ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో, నాలుగు కలర్‌ఫొటోలతో జెడ్పీ ఆఫీస్‌కు రావాలని సూచించారు.

### గాంధీ చిత్రం ఉచిత ప్రదర్శన

ఖలీల్‌వాడి : భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాల సందర్భంగా ఈ నెల 14 నుంచి 24 వరకు రాష్ట్రంలోని సినిమా థియేటర్‌లలో జాతిపిత మహాత్మాగాంధీ చలనచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 14న ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుంది. 15న ఇండిపెండెన్స్ డే సందర్భంగా, 20న ఆదివారం కారణంగా చిత్ర ప్రదర్శన ఉండదు. 16 నుంచి 24 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు చిత్ర ప్రదర్శన ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో థియేటర్‌ల నిర్వాహకులు, విద్యాశాఖ, రవాణా శాఖ, పోలీసు శాఖ, సమాచార పౌర సంబంధాలశాఖ అధికారులు గాంధీ చలన చిత్ర ప్రదర్శనకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సమన్వయం చేయనున్నారు.

### నోటిఫికేషన్ వచ్చే వరకు ఉద్యమం



నిజామాబాద్ నాగారం : రాష్ట్ర వ్యాప్తంగా పారామెడికల్ బోర్డు పరిధిలో 12 వేలకుపైగా అభ్యర్థులు కోర్సులు పూర్తిచేసి 15 ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్(పురుష) అసోసియేషన్ రాష్ట్ర నేత అశోక్ పేర్కొన్నారు. వైద్య ఎంపీహెచ్ఏ(మేల్) ఆరోగ్యశాఖలో ప్రభుత్వ, పీహెచ్‌సీల పరిధిలో రాష్ట్రంలో 10 వేలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నా నోటిఫికేషన్ ఇవ్వడంలేదన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు సంగంలో రాష్ట్ర స్థాయి అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎంపీహెచ్ఏ ఫిమేల్ పోస్టుల నోటిఫికేషన్లు వేస్తు మేల్ పోస్టులు వేయకుండా తీవ్రంగా అన్యాయం చేస్తున్నరన్నారు. కార్యక్రమంలో కలారి శ్రీనివాస్, లింగం, రాజేష్, మహేష్, లక్ష్మీనారాయణ, ప్రశాంత్, జనార్దన్, శ్రావణ్,ఉమ్మడి జిల్లాల పరిధిలోని ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్‌లోకి 3,250 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల ద్వారా 236 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 135 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 628 క్యూసెక్కుల నీరు పోతోంది.

# మరణానంతరం మరో జీవితం



**తమ ఊపిరి ఆగినా.. నలుగురి శ్వాసను నిలుపుతూ..**

**అవయవ దానంతో మరికొందరికి పునర్జన్మ ఇచ్చిన స్ఫూర్తిదాతలు**

**నేడు ప్రపంచ అవయవ దాన దినోత్సవం**

మనిషి చనిపోయాక చితికి చేరాల్సిందే.. శరీరం మట్టిలో కలిసిపోవాల్సిందే.. అయితే అవయవ దానంతో మరణం తర్వాతా జీవించవచ్చు. తమ ఊపిరి ఆగిపోయినా మరికొందరి శ్వాసగా నిలవొచ్చు. ఇటీవలి కాలంలో అవయవ దానంపై అవగాహన పెరుగుతోంది. జిల్లాకు చెందిన పలువురు తమ అవయవాలను దానం చేసి స్ఫూర్తిదాతలుగా నిలిచారు. ఆదివారం ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా స్ఫూర్తిమంతులపై కథనం..


– సాక్షి, కామారెడ్డి

సండే స్పెషల్

ఒకరి అవయవ దానం.. మృత్యువుతో పోరాడుతున్న మరికొందరి ఊపిరి నిలుపుతుంది. శరీరంలో ముఖ్యమైన అవయవాలు దెబ్బతిని ఎప్పుడు మరణిస్తారో తెలియని పరిస్థితుల్లో ఉన్న పలువురు రోగుల జీవితంలో వెలుగులు నింపుతుంది. అవయవ దానం గురించి సమాజంలో ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతోంది. గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్ర పిండాలు, కళ్లు.. ఇవి ఇతరులకు దానం చేయడానికి ఉపయోగపడే కీలక అవయవాలు. ఒక మనిషి చనిపోతూ తన అవయవాలను ఏడుగురికి దానం చేసి పునర్జన్మ ప్రసాదించవచ్చని వైద్యులు చెబుతారు. కళ్లు మాత్రమే చనిపోయిన వ్యక్తి నుంచి సేకరించగలుగుతారు. మిగతా అవయవాలు బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరిస్తారు. బ్రెయిన్ డెడ్ అంటే మెదడు ఒక్కటే పనిచేయదు. ఇతర అవయవాలన్నీ పనిచేస్తుంటాయి. ఇలాంటి వ్యక్తుల కుటుంబాలు అంగీకరిసే అవయవాలను దానం చేసి ఇతరులకు ప్రాణదాతలుగా మారడానికి వీలుంటుంది. వైద్యరంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు ఒకరి అవయవాలను మరొకరికి అమర్చడానికి అవకాశమిచ్చాయి.

**పలువురికి పునర్జన్మ..**

ప్రమాదాలకు గురై తలకు గాయమైన పరిస్థితుల్లో మెదడు పనిచేయకుండా పోయినపుడు బ్రెయిన్ డెడ్‌గా పరిగణిస్తారు. బ్రెయిన్ డెడ్ అయినా అతని శరీరరంలోని మూత్రపిండాలు, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు వంటివి పనిచేస్తాయి. వీటిని సేకరించి అవసరమైన రోగులకు అమరుస్తారు. దీనికి బ్రెయిన్ డెడ్ అయిన వారి కుటుంబ సభ్యుల అంగీకారం తప్పనిసరి. మన రాష్ట్రంలో జీవన్‌దాన్ సంస్థ అవయవ దానం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఆస్పత్రుల్లో బ్రెయిన్ డెడ్ అయి ఉన్న వారి కుటుంబ సభ్యులను కలిసి వారికి అవగాహన కల్పిస్తోంది.



**ఏ అవయవ మార్పిడికి ఎంత సమయం..**

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి రెండు మూత్రపిండాలను అవసరమైన రోగులకు అమర్చడానికి వీలవుతుంది. సేకరించిన మూత్రపిండాలను 24 గంటలనుంచి 48 గంటల్లోపు బాధిత రోగికి అమర్చాల్సి ఉంటుంది. కాలేయం చెడిపోయి మంచానికే పరిమితమైన వారికి కలేయ మార్పిడి చికిత్స చేస్తారు. అవయవ దాతల నుంచి సేకరించిన కాలేయాన్ని 12 గంటల్లో అమర్చాల్సి ఉంటుంది. గుండె అలాగే ఊపిరితిత్తులను కేవలం నాలుగు గంటల వ్యవధిలో మార్చాల్సి ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆస్పత్రులలో ఇవన్నీ జరుగుతున్నాయి. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాలను సేకరించేకన్నా ముందుగానే వాటిని అమర్చాల్సిన రోగులను అందుబాటులో ఉంచి అప్పుడు పని మొదలుపెడతారు. కళ్లను బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తితో పాటు చనిపోయిన వ్యక్తి నుంచి కూడా సేకరిస్తారు. కంటిలో కార్నియాను సేకరించి ఐ బ్యాంకులో భద్రపరిచి ఇతరులకు అమరుస్తారు.



మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన సూరోజ్ లక్ష్మీరాజం (80) ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని కిమ్స్‌లో చేరాడు. అప్పటికే బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు గుర్తించారు. జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు ఆయన కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి.. అవయవాలను సేకరించి వాటిని అవసరమైన వారికి విజయవంతంగా అమర్చారు.



కామారెడ్డికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మాధురిలక్ష్మి (23) కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌కు గురైంది. జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు ఆమె కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి అవయవ దానానికి కోసం ఒప్పించారు. ఆమె నుంచి సేకరించిన అవయవాలతో నలుగురికి పునర్జన్మ లభించింది.



మాచారెడ్డి మండలం సోమారంపేట గ్రామానికి చెందిన బానోత్ వెంకట్ (21) ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు వెళ్లి కళ్లు తిరుగుతున్నాయంటూ కింద పడిపోయాడు. ఆస్పత్రిలో చేర్పి చికిత్స చేయించినా లాభం లేకుండాపోయింది. బ్రెయిన్‌డెడ్ కావడంతో తల్లిదండ్రులు అతడి అవయవాలను దానం చేశారు.




కామారెడ్డి పట్టణానికి చెందిన గంప నవీన్(20) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌కు గురయ్యాడు. అతడు కోలుకునే పరిస్థితి లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యుల సమ్మతి తీసుకుని అవయవ దానం చేశారు. నవీన్ నుంచి సేకరించిన అవయవాలను ఇతరులకు అమర్చారు. తమ కుమారుడు భౌతికంగా తమకు దూరమైనా.. మరో నలుగురి జీవితాలలో వెలుగులు నింపాడని అతడి కుటుంబ సభ్యులు గుర్తు చేసుకుంటుంటారు.



బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లి గ్రామానికి చెందిన తరుణ్ రాయుడు (21) రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురయ్యాడు. అతడి కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలను దానం చేశారు. తమవాడు భౌతికంగా దూరమైనా నలుగురిలో జీవించి ఉన్నాడని అతడి కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల బదిలీలకు బ్రేక్..!

- వేగంగా విలీన ప్రక్రియ
- ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 2,475 మంది ఉద్యోగులు





ఖలీల్‌వాడి : ఆర్టీసీ ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులకు బ్రేక్ వేస్తూ హైదరాబాద్ బస్ భవన్ నుంచి నిజామాబాద్ ఆర్టీసీ రీజినల్ అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఈ నెల 16 తర్వాత బదిలీలు చేయవద్దని ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో ఏ డిపోలో పని చేశారో అదే డిపోలో కండక్టర్లు , డ్రైవర్లు, ఆఫీస్ సిబ్బంది రిపోర్టు చేయాలని రీజినల్ మేనేజర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. డిప్యుటేషన్‌పై వెళ్లిన ఆఫీసు సిబ్బంది సంబంధిత డిపోల్లో రిపోర్టు చేస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత సిబ్బంది ఎక్కడివారు అక్కడే ఉంటే జాబితాలో అయోమయం లేకుండా ఉంటుందని అధికారులకు ఉన్నతాధికారులు సూచనలు చేస్తున్నట్లు తెలిసింది.

**ఆరు డిపోలు..**

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 2,475 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో కండక్టర్లు 1063 మంది, డ్రైవర్లు 902 మంది ఉన్నారు. ఆఫీస్ స్టాఫ్, శ్రామికులు 510 మంది ఉన్నారు. వీరు కాకుండా వివిధ కారణాలతో సస్పెండ్ అయిన కండక్టర్లు, డ్రైవర్లను ఆర్టీసీ అధికారులు పిలిపించి మళ్లీ విధుల్లోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీలో సస్పెండ్ అయిన, కోర్టుకు వెళ్లిన, విధులకు గైర్హాజరైన వారి వివరాలను తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కసరత్తు ప్రారంభం కావడంతో డిపోల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆరుడిపోలకు సంబంధించిన వివరాలను సేకరించి అధికారులు బస్‌భవన్‌కు పంపించనున్నారు. వివరాల సేకరణ శరవేగంగా కొనసాగుతోంది.

**ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్లు తీసుకున్న అధికారులు**

ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన ఆధార్‌కార్డులు, సెల్‌ఫోన్ నంబర్లను అధికారులు రెండ్రోజుల క్రితం తీసుకున్నట్లు తెలిసింది. ఆర్టీసీ ఉద్యోగులకు జీతాభత్యాలను ట్రెజరీ నుంచి అందిస్తారని దాని నిమిత్తం ఆధార్‌కార్డులు తీసుకున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పూర్తి ఉద్యోగుల వివరాలను ఈ నెల 16 వరకు అందజేసి వాటిని ఆర్థిక శాఖకు పంపించనున్నారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన జీతాలను ఆర్థిక శాఖ ట్రెజరీకి పంపించి జీతాలు అందించనున్నారు. ఉద్యోగులకు కార్పొరేషన్ ద్వారా వచ్చే జీతాలు అందిస్తారని రెండు నెలల తర్వాత జీతాలపై ఇంకా స్పష్టత వస్తుందని ఉద్యోగులలో చర్చ జరుగుతుంది.

**సబ్‌కమిటీ నివేదిక ప్రకారమే..**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత దీనికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను తయారు చేయడానికి ప్రభుత్వం సబ్ కమిటీ వేసింది. ఆర్టీసీలో ఉద్యోగులకు జీతాభత్యాలు ఏ విధంగా ఇస్తారు అనేది సబ్‌కమిటీలో తేల్చనున్నా రు. ఆర్టీసీలో ఎక్కువ ఉన్న ఉద్యోగులను ఇతర డిపార్ట్‌మెంట్‌లకు బదిలీలు చేస్తారనే చర్చ ఆర్టీసీలో జరుగుతోంది.

# బీజేపీ మండల నాయకుల రాజీనామా



మాట్లాడుతున్న మండల బీజేపీ నాయకులు

ఎడపల్లి (బోధన్) : బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వాలక్ష్మీనర్సయ్య 13 మండలాల పార్టీ అధ్యక్షులను రాత్రికి రాత్రే మార్చివేయడంపై అసహనం వ్యక్తం చేస్తూ ఎడపల్లి మండలం జానకంపేటలో శనివారం మండల నాయకులు తమ పదవులకు రాజీనామా చేస్తున్నామని, జీవిత కాలం కమల దళంలోనే కార్యకర్తలుగా కొనసాగుతామని స్పష్టం చేశారు. వారు మీడియాతో మాట్లాడుతూ లక్ష్మీనర్సయ్య పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా స్వార్థ పూరిత నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. రాజీనామాలు సోమవారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులకు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల బీజేపీ జనరల్ సెక్రటరీ సతీష్ గౌడ్, బీజెవైఎం మండల ప్రెసిడెంట్ ప్రణయ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కృష్ణ, మోర్చా అధ్యక్షులు రమేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు కొటేశ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు పోశెట్టి, కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ చిన్నారెడ్డి, మైనార్టీ మోర్చా అధ్యక్షులు దేవేందర్ సింగ్, ఓబీసీ మోర్చా మండల కన్వీనర్ రాజేందర్ గౌడ్ , రాజేశ్వర్ గౌడ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

# అనాథలు ఉన్నారా...?

- ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్న ప్రభుత్వ బృందాలు
- గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక సర్వే



సుంకెట్‌లో సర్వే నిర్వహిస్తున్న ఉద్యోగులు

మోర్తాడ్(బాల్కొండ): తల్లిదండ్రులు లేక అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, ఇతర బంధువుల వద్ద పెరుగుతున్న చిన్నారులు ఉంటే వారిని గుర్తించాలని ప్రభుత్వం నిర్దేశించింది. అనాథ బాలబాలికలను గుర్తించడానికి ఈనెల తొమ్మిది నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో పంచాయతీ ఉద్యోగులు, అంగన్‌వాడీ ఉద్యోగులు, మున్సిపాలిటీల్లో ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి 0 వయస్సు నుంచి 23 ఏళ్ల వరకు ఉన్నవారిలో తల్లిదండ్రులు లేని వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నెల 15 లోగా సర్వే నిర్వహించి అనాథ బాలబాలికల వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదికను అందించాల్సి ఉంది. కరోనా సమయంలో అనేక కుటుంబాల్లో భార్యభర్తలు మరణించారు. ఇలాంటి పరిస్థితిలో వారి సంతానాన్ని బంధువులు పెంచుతున్నారు. అనాథల జీవన స్థితి గతులను తెలుసుకోవడంతో పాటు వారి వివరాలను నమోదు చేయడం వల్ల ప్రభుత్వం ఏదైనా కార్యాచరణ రూపొందించడానికి అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రత్యేక ఫార్మెట్‌లో అనాథలైన వారి వివరాలను నమోదు చేయడంతో పాటు మొబైల్ యాప్‌లోను వివరాలను నమోదు చేస్తున్నారు.

అనాథలైనవారి పూర్తి వివరాలను వారిని చేరదీసిన వారి వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో అనాథ బాల బాలికలను గుర్తించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సర్వే నిర్వహించడం గమనార్హం. అనాథలుగా ఉన్నవారికి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అందించనుంది.

# పోటాపోటీ దీక్షలు

- రైతులు వర్సెస్ బీఆర్‌ఎస్ నాయకులు
- రెంజల్‌లో ఉద్రిక్త పరిస్థితులు
- ఇరువర్గాలను అరెస్టు చేసిన పోలీసులు



రెంజల్‌లో రిలే దీక్షలు చేస్తున్న రైతులు



రైతులకు వ్యతిరేకంగా వారి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మండల బీఆర్‌ఎస్ నాయకులు

రెంజల్ (బోధన్): రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని స్థానిక రైతులు రెంజల్‌లోని గాంధీ విగ్రహం ఎదుట చేస్తున్న రిలే నిరాహారదీక్షలను శనివారం పోలీసులు భగ్నం చేశారు. రైతులకు వ్యతిరేకంగా మండలం టీఆర్‌ఎస్ నాయకులు గ్రామానికి చేరుకుని స్థానిక సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ ఇంట్లో సమావేశమయ్యారు. రైతుల దీక్ష శిబిరం ఎదుట బీఆర్ఎస్ నాయకులు శిబిరం ఏర్పాటు చేసుకుని ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. బోధన్ రూరల్, టౌన్, ఎడపల్లి ఎస్సైలు రెంజల్ గ్రామానికి చేరుకుని పరిస్థితిని చక్కబెట్టే ప్రయత్నం చేశారు. ఇరువర్గాలు పోటాపోటీగా నినాదాలు చేసుకునడంతో వాతావరణం వెడెక్కింది. ఇరువర్గాలను పోలీసులు సముదాయించినా ఎవరూ తగ్గేదేలే అన్న చందంగా ప్రవర్తించారు. రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్ చొరవ చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. రెండు వర్గాలు మెట్టు దిగిరాక పోవడంతో ప్రత్యేక పోలీసులను రప్పించి బలవంతంగా దీక్షలను భగ్నం చేయించారు. రైతులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులను ప్రత్యేక వాహనాల్లో ఎడపల్లి, రెంజల్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.



బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

# చెరువుల్లోకి చేప పిల్లలు ఎప్పుడో..

- జిల్లాలో 1,017 చెరువులు, ఒక ప్రాజెక్టు
- నాలుగు కోట్ల 71 లక్షల చేప పిల్లలు లక్ష్యం

బాల్కొండ : నీలి విప్లవంలో భాగంగా నూరు శాతం సబ్సిడీపై చేప పిల్లలను చెరువుల్లో ఎప్పుడు వదులుతారోనని మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు. నెల రోజుల క్రితం భారీ వర్షాలు కురియడంతో చెరువుల్లోకి నీరు చేరింది. అలుగులు ప్రవహించాయి. ప్రస్తుతం చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. సకాలంలో చేప పిల్లలను వదిలితే వేసవిలో వేటాడే సమయానికి పెరుగుతాయని మత్స్యకారులు ఆశిస్తున్నారు.

**మత్స్య సహకార సంఘాల ద్వారా..**

జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4 కోట్ల 71 లక్షల చేప పిల్లలను వదలాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. జిల్లాలో 1017 చెరువులు, ఒక ప్రాజెక్ట్ ఉంది. 243 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. చేపపిల్లలను మత్స్య సహకార సంఘాల ద్వారా సరఫరా చేస్తారు. వెంటనే చేప పిల్లలను విడుదల చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోని జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఇప్పటి వరకు 2.5 కోట్ల స్పాన్ ఉత్పత్తి చేశారు. సుమారుగా 75 లక్షల చేప పిల్లల ఉత్పత్తి అవుతుందని మత్స్య అధికారులు అంచనా వేస్తున్నారు.

**టెండర్లు ఖరారు..**

జిల్లాలో చెరువులకు, రిజర్వాయర్‌లకు అవసరమైన చేప పిల్లల కోసం ఇదివరకే టెండర్లు ఖరారు అయ్యాయి. 35 ఎంఎం నుంచి 45 ఎంఎం వరకు గల సైజ్, అంగుళం సైజ్ చేప పిల్లల కేటగిరిల్లో టెండర్లు నిర్వహించారు. ప్రభుత్వం చేప పిల్లల ఎంపిక చేపడితే వెంటనే సరఫరా చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

జిల్లాలోని చెరువులకు ఇక్కడి నుంచే చేప పిల్లలను సరఫరా చేపట్టాలని గతంలో ఉన్నత అధికారులు ఆదేశించారు.



ముప్కాల్ మండలం రెంజర్లలోని ఊర చెరువు

**త్వరలో చేపపిల్లలను వదులుతాం**

జిల్లాలోని చెరువుల్లో సబ్సిడీ చేప పిల్లలను వదిలే ప్రక్రియకు ప్రణాళికలు చేస్తున్నాం. త్వరలోనే చేప పిల్లలు వదులుతాం. ఇది వరకే చేప పిల్లలకు టెండర్లు ఖరారు అయ్యాయి. సకాలంలోనే చేప పిల్లలను వదులుటకు చర్యలు తీసుకుంటున్నాం.

– రాజానర్సయ్య, ఏడీ, మత్స్యశాఖ, నిజామాబాద్

## క్లుప్తంగా

### వన్నెల్(బి) వాసికి డాక్టరేట్


పాతకల నవీన్

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామానికి చెందిన పాతకల నవీన్ ఫార్మసీలో ఉస్మానియా వర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించాడు. గ్రామానికి చెందిన పాతక భూమన్న, జయశీల దంపతుల మొదటి సంతానమైన నవీన్ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా విధులు నిర్వహిస్తునే ఉస్మానియా వర్సిటీలో ఫార్మా రంగంలో పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు.

### గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలి



తెయూ(డిచ్‌పల్లి): గ్రూప్–2 పరీక్షలను మూడు నెలలు వాయిదా వేయాలని డిమాండ్ చూస్తూ తెయూ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తెయూ ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లుగా జాబ్ క్యాలెండర్ లేక అనేకమంది నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అభ్యర్థులు టీఎస్పీఎస్సీ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపితే వారిని అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షులు వెంకటేష్, సహాయ కార్యదర్శి సాయిప్రసాద్, వర్సిటీ నాయకులు సిరాజ్, అనిల్, రమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### వర్సిటీల పరిరక్షణ కోసం ఉద్యమిస్తాం




తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జి రెహమాన్ విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణకై ఉద్యమిస్తామని అయన పేర్కొన్నారు. శనివారం తెయూలోని ఏఐఎస్‌ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెయూలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం, తెయూ ఇంచార్జ్ తరుణ్, విష్ణువర్ధన్, శేఖర్, అజయ్ తదితరులున్నారు.

# వైన్‌షాపుల దరఖాస్తులకు తగ్గిన జోరు

- వరుస సెలవులతో నెమ్మదించిన ప్రక్రియ
- తొమ్మిది రోజులకు 225 అప్లికేషన్లు
- 16, 17, 18 తేదీల్లో భారీగా పెరిగే అవకాశాలు

ఖలీల్‌వాడి: జిల్లాలో వైన్‌షాప్‌లను నిర్వహించేందుకు రెండేళ్ల కాలానికి లైసెన్స్‌ల కోసం చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియ తడబడుతూ ముందుకు సాగుతోంది. 2023– 25కు గాను రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీ ప్రకారం రెండేళ్ల వైన్‌షాపులకు లైసెన్స్‌లను లాటరీ పద్ధతిలో కేటాయించడానికి ఈనెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. శుక్రవారం ఒకేరోజు 118 దరఖాస్తులు రాగా మొత్తంగా శనివారం 225 వచ్చాయి. గతేడాది తొలి తొమ్మిది రోజుల వరకు 300లకు పైగా దరఖాస్తులొచ్చాయి. ఈ తొలి వారంలో దరఖాస్తుల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది. శుక్రవారం ఒక రోజు పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడంతో ఎక్సైజ్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో వైన్ షాపులకు దరఖాస్తులు చేసుకోవడానికి 10 రోజులు సమయం ఇవ్వగా ఈసారి 12 రోజులు సమయం ఇచ్చారు. రెండవ శనివారం అయిన ఎక్సైజ్ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రెండో శనివారం కావడంతో కొంతమంది దరఖాస్తుదారులు ముందుస్తుగా డీడీలు, ఛలాన్లు తీసినవారు మాత్రమే దరఖాస్తులు చేస్తున్నారు.

**2021లో మొత్తంగా 1,762 దరఖాస్తులు**

జిల్లాలో 2021–23 మద్యం పాలసీకి 1,762 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ప్రభుత్వానికి రూ.35.24 కోట్లు ఆదాయం చేకూరింది. ఈ ఏడాది ఇప్పటివరకు 225 దరఖాస్తులు రాగా 34 వైన్ షాపులకు ఇప్పటికీ ఒక్క దరఖాస్తు రాలేదు. ఈసారి జిల్లా నుంచి అత్యధికంగా వైన్ షాపులకులకు దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు భావించారు. తొమ్మిది రోజుల్లో దరఖాస్తులు తగ్గడంతో ఈ సారి ఆస్థాయిలో దరఖాస్తులు వస్తాయా రావా అన్న డైలమాలో ఎక్సైజ్ వర్గాలు ఉన్నాయి.

**చివరి మూడురోజుల్లో..**

ఈనెల 13న ఆదివారం సెలవు ఆలాగే 15న స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా సెలవు కావడంతో దరఖాస్తులు తగ్గే అవకాశం ఉంది. సోమవారం ఒక రోజు దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. గతేడాది చివరి మూడు రోజుల్లో దరఖాస్తులు పెరిగినట్లు ఈసారి పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. 16,17,18 తేదీలతో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ తేదీల్లో వచ్చే దరఖాస్తులపైనే అధికారులు ఆశలు పెంచుకున్నారు. గతంలో దరఖాస్తులు చేసుకున్నవారికి, ఇప్పుడు వైన్ షాపులు నిర్వహిస్తున్న వారికి దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచిస్తున్నట్లు సమాచారం.



**గతంలో కంటే ఎక్కువ మార్జిన్..**

శనివారం జిల్లాలోని 102 వైన్ షాపులకు 53 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 225 దరఖాస్తులు వచ్చాయన్నారు. మోర్తాడ్‌కు 31, ఆర్మూర్‌కు 44, నిజామాబాద్‌కు 66, బోధన్‌కు 56, భీంగల్ 28 ఎక్సైజ్ పరిధిలోని వైన్ షాపులకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆశావహులు త్వరగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గతం కంటే ఎక్కువగా మార్జిన్ సౌకర్యం కల్పించిందని చెప్పారు.

# రెండో ఏఎన్‌ఎంల పోరుబాట

- రెగ్యులరైజ్ చేయాలని ఆందోళన
- కరోనా కాలంలోనూ సేవలందించామంటున్న ఉద్యోగినులు


సమ్మెలో భాగంగా భీమ్‌గల్‌లో ఆందోళన చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

మోర్తాడ్(బాల్కొండ): సబ్ సెంటర్లలో రెండో ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం పోరుబాట పట్టారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు పద్ధతిలోనే తాము కొనసాగుతున్నామని తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ వారం రోజుల నుంచి రెండో ఏఎన్‌ఎంలు సమ్మెలో పాల్గొంటున్నారు. జిల్లాలో 400ల మంది వరకు రెండో ఏఎన్‌ఎంలు ఉన్నారు. వీరంతా 15 ఏళ్లకు పైగా వైద్య సేవలందిస్తున్నారు. సబ్‌సెంటర్ల బాధ్యతలను నిర్వహించే ఏఎన్‌ఎంలకు సపోర్టుగా రెండో ఏఎన్‌ఎంలను గతంలో నియమించారు. వీరికి తక్కువ వేతనాలు చెల్లిస్తూ అందరితో సమానంగానే పని చేయిస్తున్నారు. రెగ్యులర్ ఏఎన్‌ఎంలు ఎంతో మంది పదోన్నతి పొంది వెళ్లిపోగా వారి పోస్టులు ఖాళీ అయ్యాయి. ఆ పోస్టుల్లో తమను భర్తీ చేస్తే రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించబడుతామని గతంలో రెండో ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాత్రం రెండో ఏఎన్‌ఎంలను కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగిస్తూ వచ్చింది. కరోనా కష్ట కాలంలో ఎంతోమందికి విశిష్టమైన వైద్య సేవలు అందించామని తమలో కొంత మంది కరోనా బారిన పడి అవస్థలు పడ్డారని వారు పేర్కొంటున్నారు. గతంలో సమ్మె నిర్వహించిన ప్పుడు దశల వారిగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం తరువాత మాట తప్పిందని వారు చెబుతున్నారు.

### 'ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలి'



కామారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

కామారెడ్డి టౌన్: సమాన పనికి సమాన హక్కులు, సమాన వేతనాలు కల్పించేలా ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని అంబేడ్కర్ విగ్రహానికి ఏఎన్‌ఎంలు వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఏఎన్‌ఎంల ఎంప్లాయిస్ అసోసియేషన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఎన్‌ఎంలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ..18 ఏళ్లకు పైగా వైద్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్నా మళ్లీ తమకు అదే ఉద్యోగం కోసం పరీక్షలు రాయడం దౌర్భాగ్యమన్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఈనెల 16 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి.బాలరాజ్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

# న్యాయవాదులకు అండగా ఉండాలి


ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ వినోద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న న్యాయవాదులు

ఖలీల్‌వాడి : న్యాయవాదుల సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవాలని నిజామాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ దాదన్న గారి మధుసుదన్ రావు అన్నారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి లీగల్ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బి వినోద్ కుమార్, గండ్ర మోహన్ రావు, బైరపాక జయకర్ తదితరు నాయకులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో రూ. 2 లక్షలకు హెల్త్ బీమా కార్డులను అందజేస్తున్నారని వాటిని రూ. 4 లక్షలకు పెంచాలని, రాష్ట్ర బార్ కౌన్సిల్ న్యాయవాదుల మరణాంతరం, లేదా న్యాయవాద వృత్తి విరమణ అనంతరం అందిస్తున్న రూ. 4 లక్షల పరిహారాన్ని రూ. 8 లక్షలకు పెంచాలని, మరో రూ. 100 కోట్లు బడ్జెట్లో కేటాయించాలని రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తూ తీర్మానించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు యెండల ప్రదీప్, వెంకటేశ్వర్ దేశాయ్, శ్యామరావు, భూషణ్ రెడ్డి, జక్కుల శ్రీధర్, అవది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ 'గమ్యం' యాప్ ప్రారంభం



ఖలీల్‌వాడి: ప్రయాణికులు ఎక్కాల్సిన బస్సు ఎక్కడ ఉంది.. ఎన్ని గంటలకు వస్తుందనే సమాచారాన్ని తెలుసుకునేందుకు తెలంగాణ ఆర్టీసీ 'గమ్యం' పేరుతో యాప్‌ను విడుదల చేసింది. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఈ యాప్‌ను వీడియోకాన్ఫరెన్స్‌లో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు వీక్షించారు. ఈ యాప్ ద్వారా తాము ఎక్కాల్సిన బస్ ఎక్కడుందన్న విషయం ప్రయాణికులకు తెలుస్తుందన్నారు. ఆర్‌ఎం జానీరెడ్డి, డిప్యూటీ ఆర్‌ఎం శంకర్,మేనేజర్లుఆనంద్,దశరథంపాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై దాడులు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఎన్‌జీవోఎస్ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యంను అధికారులు శనివారం గుర్తించారు. పట్టణ పోలీసుల సహకారంతో సివిల్ సప్లయ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 14 క్వింటాళ్ల బియ్యం వరకు రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా మటన్ మార్కెట్ ప్రాంతంలో రేషన్ బియ్యంను కొడిప్యాక శ్రీనివాస్ అనే వ్యాపారి కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా 4 క్వింటాళ్ల బియ్యంను పట్టుకున్నారు.

# మొదలైన 'గృహలక్ష్మి' దరఖాస్తుల విచారణ


లబ్ధిదారులను విచారిస్తున్న తహసీల్దార్ అనురోధ్

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలంలో గృహలక్ష్మి పథకానికి లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను అధికారులు విచారణ మొదలుపెట్టారు. గృహలక్ష్మి పథకానికి అర్హులైన లబ్ధిదారుల నుంచి 9, 10 తేదీల్లో దరఖాస్తులు స్వీకరించగా మొత్తం 1,052 దరఖాస్తులొచ్చాయి. ఇందులో రూరల్ మండలంలోని గ్రామాల నుంచి 970 దరఖాస్తులు, విలీన గ్రామాల నుంచి 82 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను ఈనెల 20లోపు పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉండటంతో అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి విచారణ మొదలుపెట్టారు. ఇందులో మండల తహసీల్దార్ అనురోధ్ తిర్మన్‌పల్లి, కొండూర్ గ్రామాల్లో 183 దరఖాస్తులు, ఎంపీవో మధురిమ పాల్దా, జలాల్‌పూర్, కేశాపూర్, ధర్మారం, మల్కాపూర్(ఏ), లక్ష్మాపూర్ గ్రామంలో 256 దరఖాస్తులు, హీరా జాదవ్ ఎంఏవో మల్కాపూర్ (జే), మల్కాపూర్(టీ) 256 దరఖాస్తులు, మల్లేష్ ఎంపీడీవో ముత్తకుంట, లింగితాండ, మల్లారం, రాంనగర్, గుండారం, శ్రీనగర్, శాస్త్రీనగర్ గ్రామాలలో 275 దరఖాస్తులను విచారిస్తున్నారు. ఇక విలీన గ్రామాల నుంచి వచ్చిన 82 దరఖాస్తులను మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు విచారణ నిమిత్తం ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


సతీశ్(ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన కమ్మరి సతీష్ (32) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారం రోజుల క్రితం సతీష్ తన సమీప బంధువు ఇద్దరు కలిసి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మెదక్ జిల్లా కొడిపల్లి వద్ద వారు నడుపుతున్న బైక్ రోడ్డు మధ్యలోని రోలింగ్‌కు ఢీకొనడంతో సతీష్ బంధువు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన సతీష్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాదుకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి తల్లిదండ్రులు, భార్య ఉన్నారు.

మృతుడికి గతేడాది వివాహమైంది. ప్రస్తుతం ఆమె గర్భవతి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు. మృతుడి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సురేందర్ ఓదార్చారు. వారికి రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు.

# పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి

నిజామాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించి, వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో శనివారం పాత కలెక్టరేట్ నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదోన్నతులు, బదిలీలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, దీంతో అనేక మంది ఉపాధ్యాయులు పదోన్నతులు లేకుండానే రిటైర్డ్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కరించకుంటే సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ మహాధర్నా నిర్వహిస్తామన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు శంతన్, సత్యానంద్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలన్నారు.



## క్రైం కార్నర్

### రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్–డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ మధ్యలో నడుస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు పడి గుర్తు తెలియని వ్యక్తి (30) మృతి చెందినట్లు ఎస్సై తావునాయక్ తెలిపారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామం వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు చెప్పారు. మృతుని వయస్సు 30 నుంచి 35 ఏళ్ల వరకు ఉంటాయని అంచనా వేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు రైల్వే పోలీసులను సంప్రదించాలని వారు కోరారు.

### చేపల వేటకు వెళ్లి ఒకరు..

నిజాంసాగర్ (జుక్కల్) : చేపల వేటకు వెళ్లిన ఆయిల్‌వార్ గంగారం(55) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిన జుక్కల్ ఏఎస్సై రమేశ్ తెలిపారు. జుక్కల్ మండలం పెద్ద ఎడ్గి గామానికి చెందిన ఆయిల్‌వార్ గంగారాం శుక్రవారం మధ్యాహ్నం వాగులో చేపల వేటకు వెళ్లాడు. సదరు వాగులో చేపల వేట చేస్తూ ప్రమాద వశత్తు వాగులో పడి మృతిచెందాడు. రాత్రి వరకు గంగారాం ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు, గ్రామస్తులు వాగు ప్రాంతంలో వెతికారు. శనివారం ఉదయం వాగులో గంగారాం మృతదేహం లభ్యమైందని ఎఎస్సై తెలిపారు. మృతుని భార్య సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**గాంధారిలో..**

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని ముదెల్లి గ్రామానికి చెందిన చింతకింది మొగులయ్య(40) చేపలవేటకు వెళ్లి వలలో చిక్కుకుని శనివారం మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు గ్రామానికి చెందిన మొగులయ్య శనివారం ఉదయం తన వ్యవసాయ పొలానికి సమీపంలో ఉన్న వాగులో చేపల వేటకు వెళ్లాడు. అయితే ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఆయన కుమారుడు వెళ్లి చూడగా వలలో చిక్కుకుని మొగులయ్య మృతి చెంది ఉన్నాడు. మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### మద్యం మత్తులో ఉరేసుకుని యువకుడు..

రుద్రూర్ : కోటగిరి మండల కేంద్రంలో కప్ప మోహన్ (35) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. శుక్రవారం రాత్రి అందరు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. మద్యానికి బానిసై మత్తులో ఉరేసుకున్నట్టుగా భావిస్తున్నారు. మృతుని తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రేషన్ కోసం వెళ్లి వృద్ధురాలు..

రుద్రూర్ : రేషన్ బియ్యం తీసుకొచ్చేందుకు వెళ్లిన వృద్ధురాలు మృతదేహమై కన్పించిన ఘటన కోటగిరి మండల కేంద్రంలో జరిగింది. కోటగిరి మండల కేంద్రానికి చెందిన చిత్తరి గంగవ్వ (60) అనే వృద్ధురాలు గురువారం మధ్యాహ్నం రేషన్ బియ్యం తీసుకొచ్చేందుకు వెళ్లి రాత్రయినా తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు గ్రామమంతా గాలించారు. శుక్రవారం ఉదయం స్థానికంగా పాడుబడ్డ ఇంటి ప్రహరీ వద్ద వృద్ధురాలి మృతదేహం స్థానికులకు కనిపించింది. మృతురాలి కూతురు సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ


అల్మారా తెరిచి ఉన్న దృశ్యం

నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండల కేంద్రంలోని బొల్లివార్ శివలక్ష్మి ఇంటికి తాళం వేసి ఉండటంతో గుర్తుతెయని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. శివలక్ష్మి తన ఇంటికి తాళం వేసి ఢిల్లీలో ఉంటున్న కొడుకు వద్దకు వెళ్లింది. మూడు నెలల పాటు అక్కడే ఉన్న శివలక్ష్మి రెండు రోజుల కిందట జుక్కల్ వచ్చింది. ఇంటి తీసి తలుపులను నెట్టగా తలుపులు తెరుచుకోలేదు. స్థానికుల సాయంతో తలుపు తెరిచే చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. ఇంట్లో అల్మారా తెరిచి చూడగా తలుపులు తెరిచి ఉండటంతో పాటు అందులో దాచిఉంచిన అర తులం బంగారు, అరకిలో వెండి అభరణాలతో పాటు రూ. 20 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్‌టీంను రప్పించి ఫింగర్ ప్రింట్స్ నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

# అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : అనారోగ్య కారణాలతో ఇంట్లో ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం రాత్రి రామారెడ్డిలో చోటు చేసుకుంది. రామారెడ్డి ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన భూపతి నవీన(38)కి ఎనిమిది నెలల క్రితం గర్భసంచి తీసేశారు. అప్పటి నుంచి ఆరోగ్యం బాగాలేక బాధ పడుతూ మనస్తాపానికి గురై గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు. భర్త సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారెడ్డి సుధాకర్ తెలిపారు.

**నవీపేట్‌లో యువకుడు..**

నవీపేట: మండలంలోని మాన్‌సింగ్ తండాకు చెందిన రాథోడ్ రాము(26) అనే యువకుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుని తల్లి సమంతబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ఆర్టీసీ కండక్టర్‌పై దాడి

- బస్సు అద్దాలు ధ్వంసం



ధ్వంసమైన ఆర్టీసీ బస్సు అద్దాలు

ఎడపల్లి(బోధన్): ఫుట్‌బోర్డు ప్రయాణం చేయొద్దన్నందుకు కొందరు యువకులు బస్ కండక్టర్‌పై దాడికి పాల్పడడమే కాకుండా బస్ అద్దాలు కూడా ధ్వంసం చేసిన ఘటన ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం వద్ద జరిగింది. ఔరంగబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్‌లో ఎమ్మెస్సీ ఫారం కు చెందిన ముగ్గురు యువకులు ప్రయాణం చేస్తున్నారు. ఎడపల్లి వద్ద ప్రయాణికులకు అడ్డంగా ఫుట్‌బోర్డుపై ఈ ముగ్గురు ప్రయాణం చేస్తుండగా కండక్టర్ వారించారు. ఎడపల్లి వద్ద మాటామాటా పెరిగి ఇరువురు దర్భాషలాడారు. అనంతరం ఎమ్మెస్సీ ఫారం వద్దకు రాగానే సదరు ముగ్గురు యువకులు, వారి స్నేహితులతో కలిసి కండక్టర్‌పై దాడి చేశారు. అనంతరం బస్సు అద్దాలు పగులగొట్టారు. దీంతో బస్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన డిపో అధికారులు, కంట్రోలర్ వీఎస్ రెడ్డి సదరు యువకులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### యువకుడి అదృశ్యం


షేక్ హైమద్

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన ఎస్‌కే హైమద్ కన్పించకుండా పోవడంతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజేశ్వర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో సెల్‌ఫోన్ ఉంచి, బైక్‌పై బయటకు వెళ్లాడని హైమద్ తల్లి సుల్తానా ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. సదరు బైక్ నిజాంసాగర్ ప్రాజెక్ట్ కట్టపై ఉందని హైమద్ మాత్రం అచూకీ లేకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నామని ఏఎస్సై చెప్పారు.

**నగరంలో..**


మసూద్‌బిన్ (ఫైల్)

ఖలీల్‌వాడి: కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన అక్తరి బేగం తన భర్త మసూద్ బిన్ మానసిక స్థితి బాగాలేకపోవడంతో ఆగస్టు 1వ తేదీన నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం తీసుకొచ్చింది. ఆస్పత్రిలో మసూద్‌బిన్‌ను చేర్పించి ఆగస్ట్ 3న డిశ్చార్జి విషయమై వైద్యుడితో మాట్లాడుతుండగా మసూద్ బిన్ అదృశ్యమయ్యాడు. దీంతో అన్నిచోట్లా వెతికి చివరకు శనివారం 1వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయ్ బాబు ఫిర్యాదు తీసుకున్నట్లు తెలిపారు. మసూద్ బిన్ కుటుంబం కామారెడ్డిలో రాజనగర్‌కు చెందిన దిగా పోలీసులు పేర్కొన్నారు.

### సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న వ్యక్తి రిమాండ్




గాంధారి(ఎల్లారెడ్డి): తరచూ సెల్‌ఫోన్లను దొంగలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి శనివారం రిమాండ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని చద్మల్ తండాలో వరుసగా రెండిళ్లలో చొరబడి సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులను అపహరించిన సంతోష్‌సింగ్‌ను అరెస్టుచేసి ఆయన వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, వెండి కడియాలు స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.